క్లుప్తంగా

న్యాస్ పరీక్షపై ఉపాధ్యాయులకు శిక్షణ



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జాతీయ సాధన సర్వే (న్యాస్)లో భాగంగా ఫిజికల్ సైన్స్ సబ్జెక్టుపై శిక్షణ నిర్వహించినట్లు మండల నోడల్ ఆఫీసర్, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. నవంబర్‌లో నిర్వహించే న్యాస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్పీలు శ్రీనివాసులు, ఖాదర్ పాష, శ్రీనివాసమూర్తి, విష్ణువర్ధన్ శిక్షణపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. మొదటి రోజు 50 శాతం ఉపాధ్యాయులు, రెండో రోజు 50 శాతం ఉపాధ్యాయులు శిక్షణకు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో నెలకొన్న పారిశుద్ధ్య పనులను చేపట్టాలని, గ్రామంలో తిష్ట సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం జీపీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, డీవైఎఫ్ఐ నాయకులు శివ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు జంబులయ్య మాట్లాడుతూ గ్రామంలో ఏ కాలనీలో చూసిన మురుగు చేరి పారిశుద్ధ్యం లోపించిందని ఆరోపించారు. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై మురుగు పారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు ప్రాథమిక పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న మన ఊరు–మన బడి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



అమరచింత: మండల నూతన తహసీల్దార్‌గా విధుల్లో చేరిన రమేష్‌రెడ్డిని మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. ఈమేరకు రేషన్ డీలర్ల సంఘం జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రేషన్ షాపులకు ప్రతి నెల మొదటి వారంలోనే సరుకులు అందేలా కృషి చేయాలని తహసీల్దార్‌ను కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వపరంగా అందిస్తున్న సరుకులను అందించాలని సూచించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు వెంకటేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ఇంజినీర్‌గా విజయ్‌కుమార్ ఎంపిక



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన బత్తుల విజయ్‌కుమార్ పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగం పొందారు. బత్తుల సరోజ, ఆదయ్య దంపతుల కుమారుడైన విజయ్‌కుమార్ ప్రాథమిక విద్యను వీపనగండ్ల ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఏఈఈ ఉద్యోగాన్ని సాధించడంపై తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గేట్ పరీక్షలో కూడా క్వాలీఫై కావడంతో విజయ్‌కుమార్ ఉన్నత పదవుల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లికి చెందిన బోయ ఆంజనేయులు ఐదు రోజులుగా కనిపించడం లేదంటూ అతడి భార్య మన్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. అంజనేయులు గత నెల 31న తెల్లవారుజామున ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. కూలీ పనికి వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించినా.. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురై గ్రామంలో, బంధువుల వద్ద వెతికారు. అయి నా ఆచూకీ లభించకపోవడంతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

కోడేరు: మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన తెలుగు వెంకటయ్య వ్యవసాయ పొలం దగ్గర సురమోని మల్లేష్, దేశమోని రామకృష్ణ, మరో కొంత మంది వ్యక్తులు శనివారం పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. వారి నుంచి రూ. 1600 నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోకారి తెలిపారు.

మొక్కలు నాటేలా.. లక్ష్యం చేరేలా



కానాయపల్లి శివారులో మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న కూలీలు

- వన మహోత్సవానికి ఏర్పాట్లు
- ఇంటింటికీ మొక్కలు పంపిణీకి సిద్ధం
- ప్రతి గ్రామంలో 3వేలకు పైగా మొక్కలు నాటాలని ఆదేశం

కొత్తకోట రూరల్: సకాలంలో వర్షాలు కురిసి, వాతావరణ సమతుల్యం ఏర్పడాలంటే అటవీ విస్తీర్ణం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, విరివిగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో 3వేల నుంచి 3,500 మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటే కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

గుంతల తవ్వకంలో నిమగ్నం

మొక్కలు నాటేందుకు వారం నుంచే గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ పథకంలోని కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లోని ఆయా నర్సరీల్లో దాదాపు 10రకాల మొక్కలు బాదం, దానిమ్మ, జామ, నేరెడు పండ్ల మొక్కలతో పాటు మునగ, టికోమా, టేకు, గుల్‌మోహర్, ఫెల్టోఫామ్, గన్నేరు, మందారం మొక్కలను పెంచుతున్నారు. సకాలంలో ఆశించిన వర్షాలు కురువకపోవడంతో వన మహోత్సవానికి ఆలస్యమైందని అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలు, రోడ్డుకు ఇరువైపులా పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేశారు.



కానాయపల్లి శివారులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి (ఫైల్)

లక్ష్యాన్ని చేరుకుంటాం



మండలంలో 87వేల మొక్కలు నాటాలని నిర్ణయించాం. గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా (ఎవెన్యూ), ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటడంతో పాటు పల్లె ప్రకృతి వనంలో, బృహత్ పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తగా మొక్కలు నాటేందుకు గుంతలు తీయించాం. అంతే కాకుండా త్వరలోనే ఇంటింటికీ మొక్కలు నాటే కార్యక్రమం చేపపడుతున్నాం. ఇందుకు ప్రజలు సహకరించాలి. నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకుంటాం. అందరి సహకారంతోనే ప్రభుత్వ లక్ష్యం నెరవేతుతుంది.

– రవీందర్‌బాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, కొత్తకోట

లక్ష్యం నెరవేరేనా?

మండలంలోని వివిధ గ్రామాల్లో 87వేల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించారు. కాగా ఇప్పటి వరకు 76వేల మొక్కలు నాటామని అధికారులు చెప్తున్నప్పటికీ కొన్ని గ్రామాల్లో నేటికీ గుంతలు తవ్వుతున్నారు. ప్రతి గ్రామంలో 3వేలకు పైగా మొక్కలు నాటాని లక్ష్యం ఉన్నా.. చాలా గ్రామాల్లో 2వేల మొక్కలు కూడా నాటలేదు. సకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

‘స్వచ్ఛదనం - పచ్చదనం’పై నిర్లక్ష్యం వద్దు



అమరచింతలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మప్ప అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 5 నుంచి 10 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. పట్టణంలోని పది వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గుంతలు పూడ్చడం, ఆరోగ్యం, వీధి కుక్కల బెడదపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సంస్థలు, స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలంలో ఈగలు, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో ప్రతి అధికారి భాగస్వామి కావాలని ఎంపీడీఓ రమణరావు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వైద్యాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం ఆరోగ్య సూచనలు చేయాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందేలా చూడాలన్నారు.

వీపనగండ్ల: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 5 రోజుల పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద కార్యకర్తలు సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. శనివారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీ వర్కర్లకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో శ్రమదానం ద్వారా నిర్వహించే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, మహేశ్వరి, కమల, ఎల్లమ్మ, ఆశా వర్కర్ రాధ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాబోధనలో సంస్కరణలు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఉషారాణి

ఖిల్లాఘనపురం: ఉపాధ్యాయులు విద్యా బోధనలో కొత్త సంస్కరణలు చేపట్టాలని ఎంఈఓ ఉషారాణి సూచించారు. శనివారం ఖిల్లాఘనపురం, రేవల్లి, గోపాల్‌పేట మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఎమ్మార్సీ వద్ద ఎన్ఏఎస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ విద్యా విధానంలో నాణ్యత పెంచడం ద్వారా కొత్త సంస్కరణలు చేపట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. మారుతున్న విద్యా విధానాలకు అనుకూలంగా ఉపాధ్యాయులు బోధనలు చేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య నందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీకాళిదాసు, శిక్షకులు వెంకటేష్, రాజేందర్‌గౌడ్, అర్జున్, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకులు బోయిన్‌పల్లి గణేష్ విమర్శించారు. శనివారం సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ సుభాష్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, ఖరీఫ్ ప్రారంభమైన నేటికీ రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రుణమాఫీ రేషన్ కార్డుతో నిబంధన లేకుండా రుణాలు ఉన్న ప్రతి రైతుకు మాఫీ చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు అమలు, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈనెల 8న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎంఎల్ మాస్ లైన్ నాయకులు సుబ్బయ్య, పెంటయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు కుర్మయ్య, వెంకటయ్య, శాంతమ్మ, లక్ష్మి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గోపాల్‌పేట: ఒక్క సీసీ కెమెరాల వంద మంది పోలీసులతో సమానమని రేవల్లి ఎస్ఐ రాము అన్నారు. శనివారం ఆయన మండలంలోని కొత్త బండరావిపాకులలో గ్రామస్తులకు సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. దాతలు, గ్రామస్తులు సహకరించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే గ్రామానికి ఎవరు వస్తున్నారు.. ఎవరు వెళ్తున్నారనేది ఎప్పటికప్పుడు తెలుస్తుందని వివరించారు. అనంతరం సైబర్ నేరగాళ్ల గురించి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో ఎన్నో రకాల మోసాలు జరుగుతుంటాయని, ప్రతిరోజు ఏదో ఒక కొత్తరకంగా మోసాలు చేస్తారని సెల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీలను మాత్రం ఎవరికీ చెప్పకూడదని అన్నారు. వీలైనంత తొందరగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మదనాపురంలో పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఖిల్లాఘనపురంలో..

మదనాపురం: మండల కేంద్రంలోని డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం భారతీయ జనతా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో దళితులు చేసిన 30 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ ఫలితమని వారు అన్నారు కార్యక్రమంలో మండల అధ్యక్షులు వంగూరు రామకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్లు రాజశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బాబుగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, నితిన్, శ్రీకాంత్, ప్రకాశ్, రేణుకుమార్, రామ్‌చరణ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో బీజేపీ నాయకులు శనివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా అత్యున్నత న్యాయస్థానం తీర్పును వెలువరించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవినాయక్, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, దశరథం, గోపాల్‌రెడ్డి, రాజు, శాంతమ్మ, తులసీకుమార్, గాండ్ల శివ, మహేష్, వెంకటేష్, చంద్రయ్య, కృష్ణయ్య, శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూర్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని డాక్టర్ చైతన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని 7, 8వ అంగన్‌వాడీ కేంద్రాల్లో, గుంటిపల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా పౌష్టికాహారం ఆవశ్యకత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రఫీఖాబాను, హసీనాబేగం, ఏఎన్ఎంలు అనిత, షాహీన్, ఆశాకార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

పాన్‌గల్: తల్లిపాలు బిడ్డకు టీకాల్లా పనిచేస్తాయని అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, రాధ, గౌసియా బేగం అన్నారు. అన్నారంతండా, చిక్కేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం, వనపర్తి మండలంలోని అచ్యుతాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ.. బిడ్డకు పాలిచ్చే సమయంలో తల్లులు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి నందకిషోర్, అంగన్‌వాడీ టీచర్లు మంజులారాణి, కవిత, రాధ, శాంతబాయి, లలితమ్మ, సంధ్య, ఆర్‌డీఎస్ జ్యోతి పాల్గొన్నారు.

చిన్నంబావి: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, పుట్టిన గంట లోపే శిశువుకు తల్లిపాలు అందించాలని ప్రత్యేకాధికారి గర్భిణులు, బాలింతలకు కురుమూర్తి సూచించారు. మండలంలోని గూడెం గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరంగాపురంలో సూచనలు ఇస్తున్న టీచరు



పాన్‌గల్ మండలం అన్నారంతండాలో..

పచ్చదనంలో ముందుండాలి

వనపర్తి టౌన్: వనపర్తికి మారుపేరు వనాలపర్తి అని, మొక్కలు నాటడంలో వనాలపర్తిని రాష్ట్రంలో ముందుంచాలని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వార్డు సభ్యులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణాన్ని పరిశుభ్రతలో ముందు వరుసలో నిలపాలని సూచించారు. దీనికోసం ప్రజాప్రతినిధులు, అధికారులు కాలనీల్లో తిరుగుతూ అవగాహన కల్పించాలన్నారు. ఇంటిలో నిల్వ నీటిని ఉంచుకోకుండా ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, మేనేజర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన




ఆత్మకూర్: అపరచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించకూడదని, ఓటీపీ తదితర వివరాలను ఇవ్వకూడదని ఎస్ఐ నరేందర్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు, స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లాటరీ తగిలిందని, ఓటీపీ చెప్పమని, బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ పొటోలను మార్ఫింగ్ చేసి డబ్బులు ఇవ్వాలని భయపెడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు బీచుపల్లి, రోషన్న, సిబ్బంది సురేందర్, జంపన్నగౌడ్, స్వర్ణలత, యుగంధర్, బాలరాజు తదితలు ఉన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటకశాఖ అధికారిగా నరసింహ



సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లా పర్యాటకశాఖ అధికారిగా వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం కల్వరాలకు చెందిన టి.నరసింహను ప్రభుత్వం నియమించింది. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నరసింహను నియమిస్తూ పర్యాటకశాఖ డైరెక్టర్ త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై జిల్లాలో టూరిజం అభివృద్ధి కార్యక్రమాలను ఆయన సమన్వయం చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇటీవల నల్లమలలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు పర్యటించి.. ఈ ప్రాంతాన్ని దేశ, విదేశీ యాత్రికులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే కీలకమైన జిల్లా పర్యాటకశాఖ అధికారిగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని నియమించడం విస్మయం కలిగిస్తోంది.

నోటీసులు అందజేత



అమరచింత: తమ వ్యాపార సముదాయాల భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్ఐ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని ప్రైవేట్ దుకాణ సముదాయాలకు వెళ్లి షాపు యాజమానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు అందించారు. జిల్లాలో వరుస చోరీలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వాటిని అరికట్టడంలో పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేస్తుందన్నారు.

ఉద్యోగ కల్పనలో కేంద్ర ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న కుతుబ్

ఆత్మకూర్: ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ సర్కార్ పదేళ్లు పూర్తి చేస్తు కున్నా.. ఉద్యోగాల కల్పన ఘోరంగా విఫలమయ్యారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ కుతుబ్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని మార్కెట్‌యార్డు ఆవరణలో ఏఐవైఎఫ్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. దేశ రాజధాని ఢిల్లీలో రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే విద్యార్థులు మృతి చెందారని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించి యువతకు న్యాయం చేయాలని కోరారు. కేరళ మృతుల కుటుంబాలకు అండగా ఏఐవైఎఫ్ విరాళాలు సేకరించి పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవి, వసీం, యూసుఫ్, మహమూద్‌పాష, సమీర్, ఇమ్రాన్, ఖాజ, చరణ్, జిలాని, అఫ్రోజ్, సోహెల్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు చేసిన స్థలాన్ని ప్రభుత్వ భూమి అనడం సరికాదు



స్థలానికి సంబంధించిన పత్రాలు చూపిస్తున్న మణికుమార్

అమరచింత: పట్టణంలోని సర్వేనంబర్ 506లో ఎకరం మూడు గుంటల స్థలాన్ని కొన్నానని, వీటికి సంబంధించిన అన్ని పత్రాలు తన వద్ద ఉన్నా కొందరు వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని కాజేశానని అధికారులకు ఫిర్యాదు చేయడం తగదని మణికుమార్ అన్నారు. 2008 సంవత్సరంలో ఐదో వార్డు సమీపంలోని సర్వేనంబర్ 506లో సయ్యద్ అస్లాం, అబ్దుల్ ఖాదర్, కుమార్‌విన్‌కు చెందిన స్థలాన్ని కొనుగోలు చేశానని, దీనికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆ స్థలాన్ని నాలాగా మార్చుకొని, వీటిలో తమ కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులకు ఇంటి నిర్మాణం కోసం ప్లాట్లును అమ్మినట్లు పేర్కొన్నారు. గతంలో హౌసింగ్ బోర్డు కాలనీ కోసం ప్రభుత్వం కొన్న స్థలంలో మిగిలిన స్థలాన్ని కాజేశానని కాలనీకి చెందిన వ్యక్తులు తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం తగదన్నారు. కమీషనర్ పంపిన నోటీసులకు వివరణతో పాటు ఆధారాలు చూపినట్లు తెలిపారు. మరోమారు సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ చెప్పడంతో.. సర్వే కోసం చలాన్ కట్టానని, అధికారులు సర్వే చేసి తన స్థలాన్ని గుర్తించాలని అధికారులకు విన్నవించామన్నారు.

‘అవ్వతాతలకు ఉత్తరాలు రాద్దాం’ రండి



పాన్‌గల్‌లో లెటర్లు చూపుతున్న విద్యార్థులు



అమబాడబాకులలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌చారి

పాన్‌గల్: పత్తిపాక ఫౌండేషన్, గడిపెల్లి ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ‘అవ్వా తాతలకు ఉత్తరాలు రాద్దాం’ రండి అంశంపై మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం లేఖ రచన పోటీలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్ఎం నరేందర్ తెలిపారు. మొదటి దశలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను లేఖ ద్వారా తమ తాత అవ్వాలకు తెలియజేశారు. లేఖ రచన నైపుణ్యం ద్వారా విద్యార్థులల్లో భాషపైన పట్టు, భావ ప్రకటన వంటి అంశాలు పెంపొందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఉత్తమ లేఖ రాసిన 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి తుది దశలో పోటీలు నిర్వహించి బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బాల సాహిత్యంపై కృషి చేస్తున్న ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: గరిపెల్లి ట్రస్టు, పత్తిపాక ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 30 పాఠశాలల్లో సాహిత్య సృజన కార్యశాలను శనివారం అమడబాకుల మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 50మంది విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు సాహిత్య సృజన కార్యశాల కన్వీనర్ డాక్టర్ తూర్పింటి నరేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యశాలను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ చారి ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకు సాహిత్య సృజన కార్యశాల కన్వీనర్ డాక్టర్ తూర్పింటి నరేష్‌కుమార్ కథలు రాయడంలో మెలకువలు, కథానిక లక్షణాలు, అగ్ని పురాణంలో మొదలైన కథానిక, ఆధునిక కాలంలో కథలో వచ్చిన మార్పులను, తెలుగు సాహిత్యంలో వచ్చిన ఉత్తమ కథలను సంక్షిప్తంగా పరిచయం చేశారు. అదే విధంగా కనుమరుగవుతున్న లేఖా సాహిత్యం గురించి వివరించి పిల్లలచే ‘అవ్వా తాతలకు ఉత్తం రాద్దాం’ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నిపుణులు రాఘవేంద్రశర్మ, ఉపాధ్యాయురాలు వకుళమాళి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటకు చెందిన బోయ అరవింద్ ఇటీవల విద్యుదాఘాతానికి గురై మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడు, ప్రధాన కార్యదర్శులు దశరథం, సత్యనారాయణ, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవి పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా అరవింద్‌కు చికిత్స అందేలా చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.